# ★ అదో ప్రపంచం ★

## దరిశి చంచయ్య

"గోపాలరావుకి ఏంపోయ్యేకాలం వచ్చింది?" అన్నది ఒకావిడ.

"ఔనటమ్మ! కమలను చెయ్యిపట్టి లాగాడట" అన్నది మరొక స్త్రీ.

"చెల్లెలి చెయ్యి లాగడమే! ఎంత దుర్మార్గం" అన్నది మరొకతె.

కమల చెల్లెలు ఎందుకయిందే? మేనమామ కొమార్తె -

గోపాలం, కమల అన్న చెల్లెలులాగ పెరిగారే!

పాపం, తల్లిలేని పిల్లకు ఎన్నికష్టాలే.

తల్లి లేక పోవడమేమిటి? తల్లి బ్రతికేవున్నది పిచ్చి పట్టింది. అప్పటినుండి కమలను మేనత్త వద్ద వుంచాడు తండ్రి.

వయసువచ్చి రెండేళ్ళయిందంటారు! ఎందుకు తీసుకెళ్ళలేదే? పెండ్లి చేయించకూడదూ?

గోపాలరావుకు యివ్వడట బీదవాడనీ. తండ్రికి రూ 1500 లు జీతం; కమలకు తల్లితాలూకు యిరవై వేల ఆస్తికూడా వుందిట?

ఇంత వుందిగదా! గోపాలుకిచ్చి పెండ్లి చేస్తే సుఖపడతారు. ఈ అల్లర్లుండవు గదా?

ఆయనెందు కిస్తాడే, మూరు రూపాయల జీతగానికి? ఏ ఐ. సి, యస్. పాసయినవారికో, ఏ అధికారికో యిస్తాడుగాని, మంచి సంబంధం కోరకే కమలను చదివిస్తున్నాడు.

గోపాలాన్ని కూడా మామే చదివించాడట, ఉద్యోగంకూడా ఆయనే యిప్పించాడట. లేకపోతే వంట బ్రాహ్మణుడు కావలసిందే!

వాడికి కృతజ్ఞతఅయినా లేదేమే.

చిన్నప్పుడు చాలా మంచివాడు తల్లి యెంత మాత్రమూ దుఃఖపడ కూడదు, నీళ్ళ తోడేవాడు, బట్టలుతికే వాడు, ఇంటిలో వనులన్నీ చేసి పెట్టాడు.

అంతేకాదే, కమల బట్టలుకూడా ఉతుకుతాడు దానికి చదువు చెప్పేవాడు, దానికి తలంటేవాడు, ఎంతమంచివాడే! ఇప్పుడు ఈలాగయ్యాడుకాని.

వాడుమాత్రం ఏం చెయ్యగలడు? విస్తట్లో మిఠాయి వడ్డించి, తినకూడదంటే ఏలాగమ్మా?

వానితల్లి దానిని కాపాడడం లేదటే.

కాపాడాలి సిందే? ఆవిడకూడ షరీగయ్యే వుంటుంది. అంత ఆస్థి అలాంటి కోడలు ఎంత పుణ్యం చేసికొనివుంటే లభిస్తాయి.

అలాగంటే మనకు పాపమొస్తుందే! లక్షమ్మ అలాంటిది కాదు. కమల చెల్లెలులాగు పెరిగింది, వద్దని ఎంతో బ్రతిమాలిందట! కంటిమీద రెప్ప వాల్చకుండా యెన్నో నెలలు కాపాడింది, అడ్డు పడిందని గోపాలం, తల్లిని కర్రతో బాదాడు. తల్లికి స్పృహతప్పి పోయింది, డాక్టరువచ్చి చికిత్సచేశాడు కూడా.

మూడురోజులు ఉపవాసం చేసిందిట?

ఎంత సంగనాచే లక్షమ్మ! నాకు తెలియదా, పిల్లను తమ్ముడివద్దకు ఎందుకుపంపడంలేదు మరి?

ఆయన తీసుకెళ్ళండే, ఢిల్లీలో వున్నాడు, యెంతో దూరం. ఆయనకు రెండోపెళ్ళి: చిన్నపిల్లని, అందగత్తెను పెండ్లి చేసుకొన్నాడే? తన యింట్లో ఎన్ని యిబ్బందులున్నాయో యెవరికి తెలుసు?

వరేలే, ఈలోగా గోపాలం గుటకాయస్వాహా చేస్తాడు, అప్పుడు ఆయనకు వాతపెట్టినట్టవుతుంది.

పాపిష్టిఆస్థి అడ్డురాకపోతే గోపాలుకంటే మంచిఅల్లుడు లభిస్తాడా? వాడు దానిని పూలల్లో పెట్టి పూజించడా?

ఇంతకీ కమలవైఖరి ఏలాగుంది?

మొదటి రోజుల్లో చెయ్యిపట్టి లాగితే ఆశ్చర్య పడింది, తర్వాత నవ్వి తప్పించుకుంటూ వుండిందంట. బలవంతాన ముద్దు పెట్టుకుంటే ఏడ్చి అత్తతో చెప్పుకుందిట। అత్త నవ్వుతూ కొడుకును అలా చెయ్యడం తప్పు కద్రా అని అన్నదట.

మర్యాదకొరకు తర్వాత కమల అత్తకు చెప్పడం మానేశింది. చదువుకూడా మానేశింది; సంగీతం పాడడమే లేదు, కృశించి పోతున్నది, వాడి మీద అసహ్యం పుట్టింది. పాపం అన్నలాగు భావించింది.

ఇరుగింటి పొరుగింటి స్త్రీలు మధ్యాహ్నం 12 గంటలు మొదలు 3 గంటలవరకు ఈలాంటి కబుర్లు మరెన్నోకూడా చెప్పుకుని కాఫీ వేళకు తమఇండ్లకు చేరుకున్నారు,

తండ్రి కూతురు పోషణకు ధారాళంగా డబ్బు పంపుతూవచ్చాడు, లక్షమ్మ అక్కను నమ్మాడు- ఆమె వితంతువు. ఒక్క కొడుకుతప్ప బిడ్డలులేరు కమలను ప్రేమతో పెంచి ఆనందించుతూ వచ్చింది నా కోడలయితే ఎంత బాగుండును అని అప్పుడప్పుడూ అనుకొనేది· అయితే తనకు తనతమ్మునికి అంతస్థులో ఎంతో భేదమున్నదని తెలుసు.

తండ్రి తనకూతురుకి చెయ్య వలసిందంతా చేశానని తృప్తి చెందాడు కాబోలు, కూతురుని చూడడానికైనా రాలేదు, రెండేళ్లుగా. తన వుద్యోగం, తనపయిళ్లు, తన ప్రమోషన్, తన చిన్న భార్య, ఆ ప్రపంచంలో మునిగిపోయాడు, కూతురి వ్యవహారంకూడా అదొకఫయిలులాగ మారిపోతూ వచ్చింది! ప్రమోషను కావాలనే ఆశతో, హృదయంలేని ఒక యంత్రంలాగ మారిపోతూవచ్చాడు చివరకు తనమామకు వ్రాశాడు,

ఆముసలాయన రాగానే—తాతా! నన్నుతీసుకెళ్లు అని ఏడ్చింది; లక్షమ్మ ఎంతబ్రతిమిలాడినా ఉండలేదు. తనుఆశించిన ఆస్థి, ఆస్థితోభార్య, పోయిందనుకొని నిరాశ చెందాడు గోపాలరావు దేవుళ్ళకు యెక్కువగా మొక్కాడు, ఛాతీవిరిచి నడవడం మానేశాడు.

అమ్మమ్మను పట్టుకొని ఏడ్చింది. కమల కృశించిన మనుమరాలిని చూచి ఆశ్చర్యపడ్డది— దుఃఖించింది, తనకేమీ అర్థం కాలేదు. కమలా! ఇకనావద్దనే వుండమ్మా· పాడు చదువులతో కృశించిపొయ్యావు చదువులు లేకపోతేపోయింది నిన్ను పెండ్లి చేసుకోవాలని ఎందరో గొప్ప వంశాలవారు కబుర్లు పంపుచున్నారమ్మా అని కమలను ఓదార్చింది.

కమలతల్లి చెప్పింది, సాధారణంగా అపూరి దేవాలయంలో వుంటుంది. పిచ్చిలేనప్పుడు తల్లిదండ్రుల దగ్గరకు వస్తుంది.

కమల తల్లినిచూచి—అమ్మా! అమ్మా!! అని కౌగలించికొన్నది, దుఃఖించింది, తల్లి ఒడిలో తలపెట్టి జాలితో అమ్మా నీకు, నీదేవునికి సేవ చేస్తూ ఉంటానమ్మా ఇకనిన్ను వదిలిపెట్టిపోను అని యేడ్చివేసింది. కూతురి ముఖమూ, చేతులూ బుజాలు తడుముతూ తనచెక్కిలిని కూతురు తల మీద ఆనించింది, నాఖర్మ ఈలాగుంది అని కన్నీరు పెట్టుకొన్నది.

కమలలో మార్పులు రావడం అమ్మమ్మ గ్రహించింది. నెలతప్పడంతో ఇదేమి ఖర్మమే అని నేలమీద కూలిపోయింది. తండ్రిగారు అర్జంటు శలవుతీసుకొని ఏరోప్లేనులో వచ్చాడు- కమల దుఃఖానికి నిరాశకుఅంతం ఉండడంలేదు.

కండ్ల నీరుపెట్టుకొని గోపాలానికియిచ్చి వెంటనే వివాహం చెయ్యండి అన్నది అమ్మమ్మ.

కమల కళ్లెర్రబడ్డాయి, చేయించి చూడండి! నుయ్యో గొయ్యో చూచుకుంటాను అన్నది.

అయ్యోతల్లీ అలా అనకే? అందరం మునిగిపోతామే। పాడు సంఘం! కమలతలను తన కడుపులో పెట్టుకుని భోరున యేడ్చివేసిందిముసలమ్మ.

అంత బీదవానికి యివ్వడం నాకు యిష్టంలేదు అన్నాడు తండ్రి-

పొరుగూరిలో వైద్యుడున్నాడు. చాలా మందికి సహాయం చేశాడు అన్నాడు తాత,

ప్రాణహాని వుండదుగదా? అన్నాడు. తండ్రి.

దైవసహాయం ఉండాలి కదా, ఏ కార్యానికైనా? అన్నాడు తాత.